జనగామలో రూ.5కే భోజనం
క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

జనగామ చౌరస్తా, ఆగస్టు 11 : నిరాశ్రయులు, నిరుపేదల కోసం జనగామ జిల్లా కేంద్రంలో రైల్వేస్టేషన్ వద్ద రూ.5కు భోజనం క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీంరాజు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు ప్రతిరోజు వేలాది మంది వస్తుంటారని తెలిపారు. జిల్లాలోని అనేక మంది నిరాశ్రయులు, అనాధలు ఇక్కడే తలదాచుకుని జీవనం సాగిస్తున్నారని అన్నారు. వీరికి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలు, దాతల సహకారంతో నెలలో ఐదు నుంచి పది రోజులు మాత్రమే పుట్టిన, పెళ్లిరోజు వేడుకల సందర్భంగా ఆహారాన్ని అందిస్తున్నామని అన్నారు. భోజన ప్యాకెట్ కొనుక్కోవాలంటే రూ.70 నుంచి రూ.100 అవుతుందని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు స్పందించి హైదరాబాద్ జంట నగరాలు, వరంగల్‌లో నిర్వహిస్తున్న మాదిరిగా జనగామ జిల్లా కేంద్రంలో రెండు చోట్ల రూ.5 భోజన క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

సీఐ దామోదర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ అర్బన్ సీఐని కలిసిన నాయకులు

జనగామ చౌరస్తా, ఆగస్టు 11 : జనగామ అర్బన్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పీ దామోదర్‌రెడ్డిని ఆదివారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, జిల్లా నాయకుడు ఉడుత రవి యాదవ్, మాజీ కౌన్సిలర్లు రామగళ్ల బాల సోమయ్య, ఆకుల లక్ష్మయ్య, నాయకులు శ్యామల పరమేశ్, శ్రీరాములు, మల్లేశ్, యాసారపు పరశురాములు, నాంపల్లి అశోక్, చాపల సమ్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 11 : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ జీ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఒంగోలు జిల్లా కందుకూరు మండలం మాలకొండ్రపాలెంకు చెందిన పిడుతల సునీత (35), పిడుతల శాంసన్ దంపతులు హనుమకొండ జిల్లా కోమటిపల్లిలో ఉంటున్నారు. వీరి బంధువు పల్లెపాటి యాకూబ్ తన బైక్‌పై సునీత, శాంసన్‌ను ఆదివారం మాలకొండ్రపాలెంకు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చాగల్లు వద్ద వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు బాధితులను వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సునీత మృతి చెందింది. మృతురాలి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318996

Wanted Sr.Pastor & Asst Pastor

★అనుగ్రహపురా సెంటెనరీ బాప్టిస్ట్ చర్చి, జనగాం మా చర్చి సంఘాన్ని ఆధ్యాత్మిక వృద్ధిలో, ఆరాధనలో మరియు సేవలో నడిపించడానికి మేము దయగల మరియు దూరదృష్టి గల రెవరెండ్ పాస్టర్ మరియు అసోసియేట్ పాస్టర్ కోరుతున్నాము. మరిన్ని వివరాల కోసం దయచేసి సెక్రటరీ మంగోలి సైలాస్ మరియు వైస్ ప్రెసిడెంట్ పగిడిపాటి నంద కిషోర్‌లను సంప్రదించండి: సెల్: 8523811853/9573170003
NTW-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

రైతు రుణమాఫీ కోసం
3,377 వినతులు

జనగామ చౌరస్తా, ఆగస్టు 11 : రైతు రుణమాఫీ కాని వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. గత నెల 18వ తేదీ నుంచి ఈ నెల 8వ తేదీ వరకు మొదటి, రెండో విడుతల్లో రుణమాఫీ కానీ రైతుల నుంచి జిల్లావ్యాప్తంగా మొత్తం 3377 ఫిర్యాదులను స్వీకరించారు. బ్యాంకు ఖాతాలో ఒక పేరుండి, పట్టాదారు పాస్ పుస్తకంలో తప్పుగా పడిన రైతులు 58 మంది, ఇంటి పేరు లేదా పేరు మారిన రైతులు 379 మంది, ఒక రైతు బ్యాంకు ఖాతాకు మరో రైతు ఆధార్ కార్డు లింక్ నమోదై ఉన్న రైతులు 50 మంది ఫిర్యాదు చేశారు. బ్యాంకులో అసలుకన్నా వడ్డీ ఎక్కువ ఉన్న రైతులు 8 మంది, బ్యాంకు ఖాతా క్లోజ్ అని చూపెడుతున్న రైతులు 603, పాస్‌పుస్తకం లేని రైతులు 84, ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవారు 24 మంది, మరణించిన రైతులు 40 మంది, నో డాటా ఫౌండ్ అని చూపెడుతున్న రైతులు 450, ఇన్‌వ్యాలిడ్ ఆధార్ కార్డు చూపెడుతున్న రైతులు 16, టు బీ ప్రాసెస్‌లో ఉన్న రైతులు 1030 మందితో పాటు పలు సాంకేతిక కారణాల చేత రుణామాఫీ కాని మిగతా రైతులు కూడా గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. వీటిని పరిష్కరించడానికి వ్యవసాయశాఖ అధికారులు బ్యాంకు అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతున్నారు.

గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే..

- పత్తాలేని గ్రామపంచాయతీ ట్రాక్టర్లు
- ప్రబలనున్న సీజనల్ వ్యాధులు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు

వెల్దండలో చెత్తను సేకరిస్తున్న గ్రామ పంచాయతీ ట్రాక్టర్

పాఠశాల ఆవరణలో చెత్తను పోస్తున్న సిబ్బంది(ఫైల్)

నర్మెట, ఆగస్టు 11 : గ్రామాల్లో పారిశుధ్య సమస్య నెలకొంది. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యలను పట్టించుకునే వారు లేక ప్రజలు సతమతమవుతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం జనవరి నెలలో ముగియడంతో అప్పటి నుంచి గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. అయితే వారు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచడం లేదు. గ్రామాలకు నియమించబడిన ప్రత్యేక అధికారులు వారి సొంత శాఖ విధులతో పాటు స్పెషల్ ఆఫీసర్ల డ్యూటీ నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీలపై పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది. మండలంలోని వెల్దండలో ప్రతి సోమవారం వారంతపు సంత కొనసాగుతుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామంలో ప్రతి రోజూ తడి, పొడి చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. నిత్యం ఇంటింటికీ ట్రాక్టర్‌లో పారిశుధ్య సిబ్బంది వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి కేంద్రానికి తరలించే వారు. దీంతో స్థానికంగా పారిశుధ్య సమస్య ఉండేది కాదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త సేకరణ చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం వారానికోసారి మాత్రమే సేకరణ చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఫలితంగా వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతున్నది. మురుగు నీటి కాల్వలను శుభ్రం చేయకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రతి సోమవారం నిర్వహించే సంతతో బస్టాండు, పాఠశాల ఆవరణలో మురిగిపోయిన కూరగాయలు రోడ్లపై పారబోస్తుంటారు. దీంతో ప్రతి మంగళవారం ఉదయం గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్లను శుభ్రం చేసి చెత్తనే ట్రాక్టర్‌లో తీసుకెళ్తారు. కానీ కొద్ది రోజులుగా గ్రామ పంచాయతీ అధికారులు ట్రాక్టర్‌ను పంపించకపోవడంతో రోడ్డు పక్కనే పాఠశాల గోడ వద్ద చెత్తాచెదారాన్ని పారబోయాల్సి వస్తున్నది. రోడ్డు పక్కనే కుళ్లిపోయిన కూరగాయలు, చెత్తచెదారం వేయడంతో కోతులు స్వైరవిహారం చేస్తూ పాదాచారులపై దాడికి పాల్పడుతున్నాయి. దీని నివారణకు ప్రతి మంగళవారం చెత్త సేకరణకు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి గణేశ్‌ను వివరణ కోరగా ఇకపై ప్రతి మంగళవారం చెత్తట్రాక్టర్‌ను అంగడి బజారుకు పంపిస్తామని తెలిపారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తాం..

వెల్దండలో పారిశుధ్య సమస్య లేకుండా చూస్తాం. ఇప్పటికే ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాం. ప్రతి సోమవారం అంగడి కొనసాగుతుంది. ఇక్కడ చెత్తాచెదారం పేరుకుపోతున్నందున మరుసటి రోజు మంగళవారం ట్రాక్టర్‌ను అంగడి బజారుకు పంపు తాం. చెత్త సేకరణతో పారిశుధ్యాన్ని పరిరక్షిస్తాం.
–సుకన్య, గ్రామ ప్రత్యేకాధికారి, వెల్దండ

18న జనగామలో విద్యాసదస్సు : టీపీటీఎఫ్

జనగామలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 18న జరిగే విద్యా సదస్సును విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీ శీనివాస్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉమాపతి భవన్‌లో టీపీటీఎఫ్ విద్యా సదస్సు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల అభినందన సభ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రంలో పాఠశాల విద్యారంగంలో 10 వేల పీఎస్ హెడ్మాస్టర్ పోస్టులు మంజూరు చేసి బీఎడ్, డీఎడ్ అర్హతలున్న ఎస్జీటీలకు ప్రమోషన్లు కల్పించి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మయ్య, ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగ విరమణ పొందిన వారికి ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశామన్నారు. సమాజం పట్ల ఉపాధ్యాయుల కర్తవ్యాలను గుర్తుచేస్తూ వారిని కార్యోన్ముఖులను చేసేందుకు ఈనెల 18న మధ్యాహ్నం 2 గంటలకు జనగామలోని సెంయిట్‌మేరీస్ హైస్కూల్‌లో విద్యా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ అంకుశావలి, వై వజ్రయ్య, జిల్లా కార్యదర్శులు యు శ్రీహరి, బానోత్ వెంకన్న, రాజారెడ్డి, ఏ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాత్రికేయులు,
ఉద్యోగులకు క్రీడా పోటీలు

బచ్చన్నపేట, ఆగస్టు11 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతోపాటు ఉద్యోగులకు సోమవారం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లికార్జున్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురుస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా కార్యక్రమాలు చేపట్టామన్నారు. పాత్రికేయులు, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు, ఈజీఎస్ సెర్ప్ ఉద్యోగులకు పంచాయతీ కార్యదర్శులకు స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించి విజేతలకు ఈ నెల 15న ముఖ్య అతిథులతో బహుమతులను అందిస్తామని మల్లికార్జున్ తెలిపారు.

తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించిన బోనాలు

- దర్దేపల్లిలో దండెమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి
- పాలకుర్తి, శివునిపల్లిలో వేడుకలు

దర్దేపల్లిలో ఎడ్లబండిపై అమ్మవారికి చీర నేస్తున్న పద్మశాలీలు

శివునిపల్లి ఆలయంలో బోనాలతో మహిళలు

పాలకుర్తి రూరల్, ఆగస్టు 11: తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బోనాల పండుగను మండలంలోని దర్దేపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా అసలేరులో దండెమ్మ తల్లిని పూజిస్తారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచే ఆడబిడ్డలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పునకాలు, డప్పు చప్పుళ్లతో ఆలయం వద్దకు వచ్చారు. ఉదయం నుంచే ఎడ్లబండ్లపై పద్మశాలీలు వీధుల గుండా తిరుగుతూ వస్త్రాలను తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని దండెమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు.

కేసీఆర్ పాలనలోనే పండుగలకు గుర్తింపు

కేసీఆర్ పాలనలోనే పండుగలకు ప్రత్యేక గుర్తింపు లభించిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. తెలంగాణలో బోనాల పండుగకు విశిష్టత ఉందన్నారు. పల్లెల్లో బోనాల పండుగను ఘనంగా జరుపుకుంటామన్నారు. దండెమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మాజీ సర్పంచ్ ఇమ్మడి ప్రకాశ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు జలగం ఆంజయ్య, నాయకులు తాడెం రవి, ఘనపురం సురేశ్, నల్లా బుచ్చిరెడ్డి, గూడ రాఘవులు, గిరగాని సుధ సమ్మయ్య, ముస్కు నిర్మల నాగిరెడ్డి, గిరగాని నర్సయ్య పాల్గొన్నారు.

పాలకుర్తిలోని పోచమ్మ తల్లి ఆలయం వద్ద భక్తులు

పాలకుర్తిలో..

పాలకుర్తి : మండల కేంద్రంలోని పోచమ్మ తల్లి ఆలయంలో స్వర్ణకార సంఘం మహిళలు ఆదివారం తొలి నైవేద్యం సమర్పించారు. ఈనెల14న బోనాల పండుగను నిర్వహించనున్న నేపథ్యంలో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడు ముత్తోజు రాజు, కార్యదర్శి కడార్ల భానుచందర్, విశ్వబ్రాహ్మణ సంఘం మండల కార్యదర్శి కందుకూరి రాజేంద్రచారి, శ్రీపాద సోమేశ్వర్ చారి, శ్రీపాద శ్రీరాములు, మారోజు ఉపేంద్రచారి, విశ్వనాధుల మోహనాచారి, దామోదర్‌చారి, ముత్తోజు రాము, రవీంద్రచారి, పానుగంటి శివ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ..

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలోని శివునిపల్లిలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి పండుగ నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఆడబిడ్డలు పసుపు కుంకుమతో, బెల్లం శాకను నైవేద్యంగా సమర్పించారు. మత్స్య పారిశ్రామిక సొసైటీ చైర్మన్ బూర్ల శంకర్, పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ నీల లింగం పూజలు చేశారు. కుల పెద్దలు చెన్నూరి వెంకటేశ్వర్లు, బూర్ల ఉప్పలయ్య, కొండ రాజయ్య, చిక్కుడు రమేశ్, చెన్నూరి వేణు, సంకెళ్ల రవి, కొండ వేణు, పిట్టల తిరుపతి, నీల రాకేశ్, గోరంట్ల యాదగిరి, అనిల్, అజయ్, దారం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

మూఢ నమ్మకాలను వీడాలి : ఎస్సై

చిల్పూరు, ఆగస్టు 11 : మూఢనమ్మకాలను వీడి ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని లింగంపల్లిలో ఆదివారం పోలీస్ కళాజాత నిర్వహించారు. ఎస్సై నవీన్‌కుమార్ మాట్లాడుతూ సైబార్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పర్యవేక్షించాలని, అనుమానితులు గ్రామానికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాహనదారులు తమ వాహనాలకు రిజిస్ట్రేషన్, ఇన్సురెన్స్ పత్రాలతోపాటు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. బైక్‌పై ప్రయాణించేప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. యువత గంజాయి, గుట్కా, గుడుంబాకు అలవాటు పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై జయకుమార్, హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ వీరన్న, కళాజాత ఏఎస్సై నాగమణి, మాజీ సర్పంచ్ ఎదునూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో జఫర్‌గఢ్‌లో రోడ్డు పనులు పూర్తి

జఫర్‌గఢ్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

జఫర్‌గడ్, ఆగస్టు 11 : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాలతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారి నిర్మాణ పనులను అధికారులు పూర్తి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జఫర్‌గఢ్ జీపీ పరిధిలోని 1వ వార్డులోని ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు ఏడాదిగా నిలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై నీరు నిల్వడంతో గుంతలు ఏర్పడి బురదమయమైంది. దీంతో వాహనదారులు, బాటసారులు నడిచేందు వీల్లేకుండా పోయింది. ఇటీవల స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి బురద రోడ్డును చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న, మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్పందించిన అధికారులు రోడ్డు నిర్మాణానికి హద్దులు నిర్ణయించి మరమ్మతు పనులను పూర్తి చేశారు. ఆలస్యంగానైనా రోడ్డు పనులు పూర్తి చేసినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

జనగామ, నమస్తే తెలంగాణ/లింగాలఘనపురం, ఆగస్టు 11 : విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యెనగందుల వజ్రయ్య, జిల్లా కార్యదర్శి ఉప్పల శ్రీహరి డిమాండ్ చేశారు. ఆదివారం ఎం గణేశ్ అధ్యక్షతన జరిగిన టీపీటీఎఫ్ లింగాలఘనపురం మండల కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కమిటీ రెండేళ్ల పనితీరు, ఆర్థిక నివేదికను ప్రధాన కార్యదర్శి శివకుమార్ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో 10 వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేసి బీఈడీ, డీఈడీ అర్హత కలిగిన వారికి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. 2023 సంవత్సరం బదిలీల సందర్భంగా సాంకేతిక కారణాలతో తప్పుడు ఆప్షన్లు నమోదు చేసిన చాలా మంది ఎస్‌జీటీలు అనుకూలంలేని స్థానాలకు వెళ్లారని తెలిపారు. తిరిగి ఆన్‌లైన్ ద్వారా వారిని లెఫ్ట్ ఓవర్ ఖాళీల్లో నింపాలని కోరారు. ఏకీకృత సర్వీసు రూల్స్‌కు త్వరితగతిన మోక్షం కల్పించి 20 ఏండ్లుగా నిలిచిన పదోన్నతులను కల్పించాలని, 'మనఊరు–మన బడి'లో అర్థాంతరంగా ఆగిపోయిన పెండింగ్ పనులకు వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పూర్తి చేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేశారు.

నూతన మండల కమిటీ ఎన్నిక

టీపీటీఎఫ్ లింగాలఘనపురం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాచర్ల ప్రభాకర్ (కళ్లెం), ప్రధాన కార్యదర్శిగా రాజయ్య (చీటూరు), ఉపాధ్యక్షులుగా ఎండీ ఖాసీం (వనపర్తి), భారతమ్మ (కళ్లెం), కార్యదర్శులుగా శ్రీనివాసాచారి (కుందారం), సత్యనారాయణ (కళ్లెం), భాస్కర్ (కుందారం), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా రాములు (లింగాలఘనపురం), మధుసూదన్‌రెడ్డి (కొత్తపల్లి), ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా నర్సింహారావు, శ్రీనివాస్ బాబు, అకాడమిక్ సెల్ కమిటీ కన్వీనర్లుగా ఉప్పలయ్య, తిరుపతయ్య, కార్యవర్గ సభ్యులుగా వీరయ్య, జ్యోతిర్మయి, నరేందర్‌యాదవ్, ప్రమీలారాణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎనగందుల వజ్రయ్య, జిల్లా కార్యదర్శి ఉప్పల శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభాకర్

రాజయ్య

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

రేషన్‌బియ్యం చూపుతున్న పోలీసులు

రఘునాథపల్లి, ఆగస్టు 11: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న సుమారు ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ యాదవ్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన విలేకరులకు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల పుట్టగూడెం గ్రామానికి చెందిన మూడవత్ రవి ట్రాలీ ఆటోలో రేషన్ బియ్యంను తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు నిడిగొండ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ట్రాలీ ఆటోను గుర్తించిన పోలీసులు సీజ్ చేశారు. రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ యుగేంధర్ పాల్గొన్నారు.

'జర్నలిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలి'

జనగామ, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులను ఆదుకోవాలని హమ్‌సాత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహ్మద్ యాకూబ్ పాషా కోరారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరంగల్‌కు చెందిన ఓ యూ ట్యూబ్ చానల్ జర్నలిస్టు యోగిరెడ్డి తన కుమార్తెతో సహా ఆత్మహత్యకు చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిదని గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో జర్నలిస్టుల ఆర్థిక పరిస్థితులు అంతంతానే ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జర్నలిస్టుల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరారు.

నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బచ్చన్నపేట, ఆగస్టు 11: మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పంపిణీ చేస్తారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండలంలోని కొడువటూర్ శ్రీనిధి ఫంక్షన్ హాల్‌లో అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతారని చంద్రారెడ్డి వెల్లడించారు. ఆయా గ్రామాల లబ్ధిదారులు, బీఆర్‌ఎస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

జలేందర్‌ను సన్మానిస్తున్న రజక సంఘం సభ్యులు

రజకుల అభ్యున్నతికి నిరంతరం కృషి

బచ్చన్నపేట,ఆగస్టు 11: రజకుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని రజక సంఘం గ్రామ అధ్యక్షుడు మినలాపురం జలేందర్ అన్నారు. మండలంలోని కొడవటూర్ గ్రామ రజక సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా మినలాపురం జలేందర్‌ను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రజకులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. తనపై సమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మృతదేహానికి నివాళులర్పిస్తున్న జంగా రాఘవరెడ్డి

దేవరుప్పుల, ఆగస్టు 11 : కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తల్లి పెద్ది లచ్చుమ్మ(75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం లచ్చుమ్మ కుమారులు పెద్ది కృష్ణమూర్తి, పెద్ది వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు లచ్చుమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాం, సీపీఎం నాయకులు సింగారపు రమేశ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ, బీఆర్‌ఎస్ మండల నాయకులు కారుపోతుల భిక్షపతి, చింత రవి, గండిపల్లి యాకయ్య, హనుమంతు, మహేశ్, నక్క రమేశ్, లొడంగి వెంకన్న, మధు, కాంగ్రెస్ నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు, బోనగిరి యాకస్వామి ఇనుముల నాగరాజు, దావెర అనిల్, భాస్కర్, ఉప్పలయ్య, లీనారెడ్డి ఉన్నారు.

భూమి పూజ చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

రచ్చబండ నిర్మాణానికి భూమి పూజ

స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 11 : మండలంలోని రాఘువాపూర్‌లో రచ్చబండ (ఓపెన్ డయాస్) నిర్మాణానికి మాజీ ప్రజాప్రతినిధులు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. గ్రామసభ నిర్వహణతోపాటు స్థానిక సమస్యలను చర్చించుకోవడానికి, ఉత్సవాలు నిర్వహించేందుకు రచ్చబండను ఏర్పాటు చేసుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పలువురి సహకారంతో సుమారు రూ.2 లక్షల వ్యయంతో రచ్చబండను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కందుల రేఖాగట్టయ్య, మాజీ సర్పంచ్‌లు కాసాని మల్లయ్య, కాసాని బొందయ్య, దశరథం, కందుల శ్రీలత శ్రీను, మాజీ ఉప సర్పంచ్ కాసాని మల్లయ్య, కుక్కల రాజు, రేగన్‌రెడ్డి, బట్టమేకల రాజు, రావుల రవి, పవన్, క్రాంతి, ఉపేందర్, హన్మంతు, పిట్టల రాజేందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ


జఫర్‌గఢ్‌లో గిరి ప్రదక్షిణలో భక్తులు

జఫర్‌గఢ్, ఆగస్టు 11 : మండల కేంద్రంలోని పడమటి కొండపై కొలువైన శ్రీ వేల్పుగొండ లక్ష్మీ నరసింహస్వామి వారి గిరి ప్రదక్షిణను భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల బాధ్యులతో పాటు, పలు ప్రాంతాల భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ప్రతి యేటా శ్రావణ మాసంలో నిర్వహిస్తున్న లక్ష్మీనర్సింహస్వామి జాతరలో భాగంగా స్వామి వారి గిరి ప్రదక్షిణను కొనసాగించారు

యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్
వేలం కోసం బహిరంగ ప్రకటన
తాకట్టు బంగారు ఆభరణాల ఆస్తుల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

దిగువ ఖాతాలలో తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలాన్ని దిగువ తెలిపిన బ్రాంచ్ వద్ద యాక్సిస్ బ్యాంక్ నిర్వహించుటకు ప్రతిపాదించిందని నిర్దేశిత రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన రుణగ్రహీతలు సెక్యూరిటీ నిమిత్తం బ్యాంక్ పేరున బంగారు ఆభరణాలు (బంగారు రుణ సౌకర్యం) తాకట్టుపై యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణ సదుపాయాలను వినియోగించుకున్నారు. వినియోగించుకున్న బంగారు రుణ సౌకర్యం నిమిత్తం తమ బకాయి మొత్తాలను చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/హామీదార్లను కోరుతూ రుణగ్రహీతలకు/హామీదార్లకు డిమాండ్ నోటీస్‌లు జారీ చేశారు. అయితే రుణగ్రహీతలు/ హామీదార్లు బకాయి రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున తాకట్టు ఇన్‌వోక్ చేయుట బ్యాంక్‌కు తప్పనిసరి అయింది మరియు ఆస్తి షెడ్యూల్‌లో మరింతగా వివరించిన తాకట్టు బంగారు ఆభరణాలను '' ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే మరియు రికోర్స్ పద్ధతి లేని విధంగా''
తేది: 22 ఆగస్టు 2024న మ. 12.30 గం. నుండి మ. 3.30 గం. మధ్య (ఇ-వేలం సమయం) ఇ-వేలం అమ్మకం నిర్వహించుటకు ప్రతిపాదించబడినది.
రుణగ్రహీతలు & బకాయి మొత్తం వివరాలు:

క్ర.సం.	బ్రాంచ్ పేరు	రుణ A/c నం.	వినియోగదారు పేరు	బకాయి మొత్తం	డిమాండ్ నోటీస్ తేది	స్థూల బరువు	నికర బరువు
1	జనగాం WAR TG	xxxxxxxxxxx2136	స్వర్గం రాజ్‌కుమార్	126471	22-జూన్-24	30	27
2	జనగాం WAR TG	xxxxxxxxxxx9744	స్వర్గం రాజ్‌కుమార్	112590	22-జూన్-24	27.9	25.1

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతాను తొలగించుటకు/ వేలం తేదీని మార్చుటకు యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌కు అథారిటీ కలదు. వేలం ఆన్‌లైన్‌లో https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)లో మ. 12.30 గం. నుండి మ.3.30 గం. మధ్య (సమయం) నిర్వహించబడును.
సవివరమైన నియమ నిబంధనల కొరకు వెబ్‌సైట్ https://gold.samil.in (ఆన్‌లైన్ వెండార్ యొక్క వెబ్‌సైట్)కు లాగిన్ కావలెను.
అధీకృత అధికారి,యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్